# స్మృతి చిహ్నం

రచన:
తోలేటి ఏ. ఎస్. ప్రసాద్

అది మొగలాయీ సామ్రాజ్యం. అర్ధరాత్రి సమయం—ఆ నిశ్శబ్దనిశీథంలో నగరానికి సమీపంలో స్మశానంలో—

నిషాధభరంతో — విషాదస్వరంతో — ఒక గంభీరకంఠం ఈవిధంగా ఆలపిస్తూ విలపిస్తూంది,

" పలికింతునే భగ్నజీవితవీణ
శ్రాంత, నిశాంత, ప్రశాంత
సీమలలోన"........

అవిధంగా ఆలపించే ఆకంఠంలో విషాద తరంగాలు పొంగిపొరలి ప్రవహిస్తున్నాయి. ఆ గీతం అంతఃపురంలో హంసతూలికాతల్పం మీద పవళించిన ఆలంపనా కర్ణపుటాలలో ధ్వనించింది అతని హృదయంలో—

"గతబాధల ఘంటారావం" సున్నితమైన మమకారాల గర్భగుడిలో .... "వ్యధ నిండిన విలయ నినాదం"—ఒక్కసారిగా మ్రోగేయి.

ఆలంపనా కళ్ళుతెరిచాడు-ఎదురుగానున్న తన మధురమూర్తి "జౌలియా బీబీ" ఛాయా చిత్రంవైపు తదేకధ్యానంతో చూశాడు....అతని హృదయంలో అంతవరకూ అణగి, మణిగి వున్న ఆవేదన, అడ్డకట్టును తన్నివేసిన సెలయేటి ప్రవాహంలా ఒక్కసారిగా విజృంభించింది .... కళ్లల్లోనుంచి అశ్రుధారా ప్రవాహం అపరిమితంగా ఆ ఛాయాచిత్రాన్ని తడిపివేసింది.

బాధగా, భారంగా నిట్టూర్చి తలవంచాడు జహాంపనా "జౌలియా" అని మృదువుగా పలికేయి అతని పెదవులు.

దూరంలో....ఆ తీరంలో....అగీతం ఇంకా అలా వినిపిస్తూనేవుంది.

"ఓ అమర సంధాయీ
అనురాగ రసఫాయీ
అస్తమించినదాశ....ఆవరించెను
శోకతిమిరమ్ము హృదయాన"

అవును! నిజం! ఏనాడు తనజీవితపథంలో జీవనజ్యోతి ఆరిపోయిందో, ఏనాడు నాఏకైక మధురమూర్తి "జౌలియా శాశ్వతంగా నన్ను విడిచి కన్నుమూసిందో-అనాడె నిరాశనిండిన నా హృదయాకాశంలో శోకతిమిరం అవరించింది" అంటూ అమె చిత్రపటం ముందు ఒరిగిపోయాడు ఆలంపనా—అయినా, అతని మనస్సుమాత్రం మళ్లిపోయిన జీవనపథంలోంచి—మళ్ళా నాలుగడుగులు వెనక్కి మళ్ళింది. యీ భూమిమీదనుంచి తనకి ఋణంతీరిపోయే అఖరుక్షణంలో అంత్యశయ్యమీదనున్న "జౌలియాబీబీ" అతని ఊహా దృక్పథంలో మెరిసింది హఠాత్తుగా కళ్ళల్లో కదిలింది.

ఆ క్షణంలో తను ఆమె శయనించిన, శయ్యపై కూర్చున్నాడు. కన్నీళ్లతో తననివిడిచి పోబోతున్న, తన జీవితసమభాగిని ముఖంలోకి చూస్తూ, "జౌలియా" అని బాధగా పిలిచాడు.

ఆమె తనమునివేళ్లతో మృదువుగా కన్నీళ్లు తుడుస్తూ "కంట తడిపెట్టకండి ఆలంపనా! బ్రతికినంతకాలం, మీ జీవిత సమభాగినిగా నా ధర్మం నిర్వర్తించి, మిమ్మల్ని ఏవిధంగానూ సుఖపెట్టలేకపోయాను" నన్ను మన్నించండి! మరణించే అఖరు క్షణంలో మీ కన్నీళ్లు చూడలేను....కనికరించి, నా కోసం కన్నీళ్లు తుడుచుకొని, చిరునవ్వుతో నన్నీలోకంనుంచి సాగనంపండి ప్రభూ" అంటూ "జౌలియా" కళ్ళుమూసింది. తనని శాశ్వతంగా యీ దుర్భర దుఃఖపూరితమైన ప్రపంచంలో ఒంటరిగా విడిచిపోయింది.

అనాటి సంఘటన ఆలంపనా "స్మృతి పథం"లో మెదలగానే, అంతవరకూ తనలో గూడుకట్టుకుపోయిన దుఃఖం తిరిగి విజృంభించింది....పసిపాపలా కన్నీళ్లతో "జౌలియా" అంటూ విలపించేడు ఆలంపనా!

ప్రపంచంలో ఒకవ్యక్తి, మరొకవ్యక్తికోసం, అవసరమైతే, తన ప్రాణాలనైనా బలిచేసి, బ్రతికించుకోగలిగే—సదుపాయం యేమైనా వుండివుంటే, తనజీవితంలో ఏకైక ప్రణయ మూర్తిని కోలుపోయేవాడుకాదు ఆలంపనా కాని, విధికృతం ఆమెని శాశ్వతంగా దూరం చేసింది. అనాటినుంచీ ఆలంపనా పూర్తిగా మారిపోయాడు. తనకళ్ళకు ప్రపంచమంతా అంధకారంగా తోచింది....లోకానికి పూర్తిగా దూరమైపోయాడు. ఎప్పుడూ తన "ప్రణయ దేవత" "జౌలియాబీబీ" స్మరణలోనే మునిగిపోతూ, తన సర్వస్వాన్నీ మరచిపోయాడు. "అమె ధ్యాసే తన జీవితం" అంటూ కలలు కంటూ తన ఊహాలోకంలో ఆ మధుర మూర్తిని శాశ్వతంగా చెదిరిపోని అమృత ముద్రికలా ప్రతిష్ఠించుకున్నాడు. తన ఏకాంత మందిరంలోనున్న ఆమె ఛాయాచిత్రంలో అహర్నిశలూ ఆమె రూపాన్ని సందర్శించుకుంటూ, మానసిక సంతృప్తితో గడుపుతున్నాడు ప్రభువు....అసలే ఆవేదనతో అలమటిస్తున్న, ఆలంపనాహృదయంలో ఆ అర్ధరాత్రిలో ఎక్కడో దూరంలో వినిపించే ఆ గంభీరకంఠధ్వనీ, ఆ విషాదగీతం మరింత సంక్షోభం రగిలిస్తోంది.

★ ★ ★

నా హృదయసీమలో నవనవోజ్వల భావ
నాట్యరేఖలు తీర్చి నవ్యగీతులు కూర్చి
పలికించి, పులకింప, మెరపువై మెరశావు
మరు నిముసమున నీవు మాయమై పోయావు

అదేగీతం....గతరాత్రి తన హృదయంలో సంక్షోభం రగిలించిన అదే కంఠధ్వని....

ఆలంపనా మెల్లిగా శయ్యపైనుంచి లేచాడు. తడబడే అడుగులతో అంతఃపుర ప్రాంగణం దాటి, వెలుపలికి ప్రవేశించాడు.

ఆ గీతాన్ని అనుసరిస్తూ అలా....అలా.... అడుగులువేసుకుంటూ ముందుకు నడక సాగించాడు. స్మశానంలోనుంచి ఆ గీతం వినిపిస్తోంది. నలుదెసలా అంధకారం కన్ను పొడుచుకున్నా కనిపించని ఆ కారుచీకటిలో ఆ స్మశానంలో ఆలంపనా కాలికి ఒక చాయా చిత్రం తగిలింది. అతృతగా తీసి ఆ తైల చిత్రాన్ని పరికించి, తదెకంగా చూశాడు.... ఆశ్చర్యంలో మునిగిపోయాడు ఆలంపనా.... మరొకసారి దీర్ఘంగా పరికించి చూశాడు.... "నిజంగా అది తన అర్ధాంగి 'జౌలియాబీబీ' చాయాచిత్రమే. సందేహంలేదుఏమిటీవిచిత్రం! అమెచిత్రం ఈ స్మశానంలోకి ఎలాగొచ్చింది? దూరంగా వినిపించే ఆ విషాదకంఠస్వరం ఏమిటి? 'అలా విలపించే ఆ నిర్భాగ్యుడు ఎవరు?' అంతా అయోమయంగా తోచింది ఆలంపనాకి. నడక సాగించి, ముందుకు పోయాడు. అక్కడి దృశ్యం ఆలంపనాకి మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. రకరకాల పూలమాలలతో అలంకరించిన ఆ సమాధి 'జౌలియాబీబీ'దే — తను పొరపడడంలేదు! మరి ఆ యువకుడు ఎవరు? గతించిన తన అర్ధాంగి సమాధిముందు కూర్చొని, అవిధంగా విలపించే అవుసరం అతనికేం కలిగింది? ఆలంపనా హృదయంలో రకరకాలప్రశ్నలు, తెగనిసమస్యలు ఒక్కసారిగా కలిగి దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. ఆ యువకుడు చీకటిలో తడుముకుంటూ నల్లనినీడలా నిలబడిన ఆలంపనాన్ని సమీపించి, 'ప్రభూ' అని బొంగురుపోయిన కంఠంతో పిలిచాడు. కన్నీ

ళ్లతో ప్రభువులపాదద్వయానికి అభిషేకంచేసి ప్రణమిల్లేడు.

అలంపనా ఆలోచనలు చెవరిపోయి, ఆశ్చర్యంగా అతనివంక చూస్తూ 'ఎవరునీవు?' అని ప్రశ్నించాడు సూటిగా....

"నే నొక నిర్భాగ్యుణ్ణి ప్రభూ!....భగ్న ప్రణయంతో ఘోషించే బాధిత హృదయం నాది....నా విషాదచరిత్రని ఏనాటికైనా మీకు తెలియజేయాలనే, ఇంత కాలంగా ఎదురు చూశాను. నేటికి మీ దర్శనభాగ్యం లభించింది జహాఁపనా!" అంటూ బాధగా, భారంగా ప్రభుసాన్నిధ్యంలో ఒరిగిపోయాడు ఆ యువకుడు.

అలంపనా జాలిగా అతనివైపు చూస్తూ 'ఏమిటి నాయనా నీ చరిత్ర?' అని ప్రశ్నించాడు....అతను భారంగా నవ్వుతూ ప్రభువుల ముఖంలోకి చూశాడు .... ఒక్కసారి కళ్ళు గట్టిగా మూసుకొని—

"ఔలియా" అని స్మరించాడు.

కొన్నిక్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.... అతను చెప్పడం మొదలుపెట్టేడు.

"నేను ఒక కళాకారుణ్ణి ప్రభూ—కాని అలా చెప్పుకుందుకు యీనాడు నేనెంతో బాధ పడుతున్నాను. నా జీవితమంతా కవనానికీ, చిత్రలేఖనానికీ, ధారపోశాను. ఎన్నో మహత్తర చిత్రాలు వెలువరించాను. ప్రణయప్రబంధాలు రచించాను....అయితే;—

నావిద్య నాలోగల నైపుణ్యంకాదు జహాఁపనా!....'ఔలియా' అపురూప విన్యాసం నాలో భావోద్రేకం కలిగించి, నాచేత చిత్రాలు గీయించింది. పూర్ణచంద్రబింబాన్ని మరిపించే ఆమె సౌందర్యం.

అమృతవర్షంవంటి అమరగానం.

మనోహరమైన ఆమె మయూర నృత్యం నాలో ఆవేశాన్ని కలిగించి, నాచేత కలం పట్టించి కవిత వ్రాయించాయి.

ఆమెకోసమే నేను చిత్రలేఖనంకృషిచేశాను.

ఆమెకోసమే నేను కవిత్వం వ్రాశాను.... ఒక్కమాటలో చెప్పాలంటే ఆమెకోసమే నేను జీవించానుకూడా....

"ఔలియా" నన్ను ఏనాడూ కన్నుతెరచి చూడకపోయినా, నేనుమాత్రం ఆమెని మనసారా ప్రేమించాను. ఆమెకోసం ఎన్నో తీయని కలలుకన్నాను. 'ఔలియా' నా అర్ధాంగికావాలని అహోరాత్రాలు 'అల్లా'ను ధ్యానించాను....కాని;

ప్రపంచం మమ్మల్ని దూరతీరాలలో నుండవలసిందిగా శాసించింది....మా యిద్దరి మధ్యా 'పేదరికం' అనే అడ్డగోడకట్టింది.

విధి మమ్మల్ని విడదీసింది .... సమాజం నా ప్రేమనిచూసి సహించలేకపోయింది.... చట్టం మా కలయికకి కట్టుదిట్టం చేసింది. 'ఔలియా'ని మనసారా ఒకసారిచూసి, నోరు తెరిచి మాట్లాడే యోగంకూడా నాకు కలిగించకుండా .... మహాఁ ప్రాసాదమధ్యంలో ఆమెనూ, ఆమె భవనప్రాంగణానికి బయటి నడివీధిలో నన్ను, విడివిడిగా వుండవలసిందిగా విడదీసి, శిక్ష విధించింది సంఘం.

ఫలితంగా నా పవిత్రప్రణయం చెదిరిపోయి నాకలలన్నీ కరిగిపోయాయి. 'ఔలియా' తమకి అర్ధాంగి కాబడింది.

నా 'జీవనరాణి' నాకు కనుమరుగైపోయింది ప్రభూ! అని గతాన్ని తల్చుకుని నిట్టూర్చాడు ఆ యువకుడు.

ప్రభువుల కనుకొలకులనుంచి అశ్రుధారలు ప్రవహించాయి. ఆయువకుడు తిరిగి చెప్పడం మొదలుపెట్టేడు. 'ఔలియా నా అర్ధాంగికావాలనే స్వార్థం నాలోనుంచి తొలగిపోయింది ప్రభూ! నాహృదయానికి హృదయం నాప్రాణానికి ప్రాణం....నా ప్రణయరాణి 'ఔలియా' ఒక మహాఁ చక్రవర్తికి అర్ధాంగికావడంతో నేనెంతో పొంగిపోయి, నాలో సంతోషతరంగాలు విరిశాయి. ఆమె ఒక మహాఁరాణిగా అంతఃపురంలో అనంత భోగభాగ్యాలతో తులతూగుతూంటే నేనెంతో మురిసిపోయాను. ఆమె నా సుఖాలకీ, సంతోషాలకీ, ఉపయోగించకపోయినా, నేనుమాత్రం ఆమెనే అనుక్షణం నా ప్రణయాధిదేవతగా ఆరాధిస్తూ కలకాలం గడపాలని కలలుకన్నాను. అందుకే నాహృదయేశ్వరి చిత్రాలు నవనవ భావాలతో ఎన్నో చిత్రించాను.

అంటూ ఆ యువకుడు మట్టిలో పొర్లాడే కొన్ని మహత్తరచిత్రాలని అలంపనా ముందు పెట్టేడు. సజీవంగా కదులుతున్నట్టుగా అతిమనోహరంగా చిత్రించిన 'ఔలియా' చిత్రాలు చూడగానే అలంపనా హృదయం ఒక్కసారిగా ద్రవించింది. 'ఔలియా'మీద ఆ యువకుడు వ్రాసిన గీతాలు అలంపనా శరీరాన్ని పులకింపజేశాయి. కన్నీరు నింపేడు ప్రభువు.

"కానీ, విధి మనస్తత్వం విచిత్రమైనది జహాఁపనా! నా కుంచె చెదిరి, నా చిత్రం కళలు మాసింది. నాకలం విరిగి నా కవనం కుంటుపడింది. నాతో లేకపోయినా, నాలో నున్న నా 'ప్రణయిని' యీ ప్రపంచానికే శాశ్వతంగా దూరమైపోయింది. నా జీవితమే నిరర్థకమైపోయింది జహాఁపనా? ఇక నేనెవరికోసం బ్రతకాలి? ఎవరి సుఖాలుచూసి సంతోషించాలి?"

నా 'జీవన జ్యోతి'లేని ఈ ప్రపంచంలో ఒక్క క్షణమైనా యింక బ్రతకలేను. ఆమెకోసం నా జీవితమే బలిచేస్తాను. శాశ్వతంగా నేనుకూడా కన్నుమూసి, యీ లోకానికి దూరమై, మరోలోకంలోనైనా నా 'ఔలియా' రూపాన్ని సందర్శిస్తాను."

అతనికంఠం ఆగిపోయి, శరీరం కరడుకట్టిపోయింది. కళ్లలో జీవం నశించి, తుది సారిగా అతని నిట్టూర్పు గాలిలో కలిసి, అనంతవిశ్వంలో కరిగిపోయింది.

అలంపనామృదువుగా తనహస్తాలతో అతని శరీరాన్ని స్పర్శించి, కళ్లకద్దుకున్నాడు....తన కన్నీళ్లతో అతని కళేబరాన్ని అభిషేకించాడు.

నిజమైన ప్రేమలో అంతరార్థాన్ని గ్రహించ గలిగేడు. అలంపనా!....అతని అంతఃకరణ తన ప్రేమని శంకించింది.

నిజ నిజాలు-యోచిస్తే, వివరాలు తర్కిస్తే తను ఆయువకుని కంటే ఎక్కువగా నే "ఔలియా"ని ప్రేమించాడో లేదు—ఆ యువకుని ప్రేమముందు తన ప్రేమఎందుకూ కొరగాదు.

"ఔలియా" ఏనాడూ ఆ యువకుని ప్రేమించలేదు....కనీసం కన్నెత్తి ఒకచూపు-నోరుతెరిచి ఒకమాట-ఆ భాగ్యానికికూడా నోచుకోని అభాగ్యుడు పాపం ఆ యువకుడు— ఆమె తనని ప్రేమించినా ప్రేమించకపోయినా — అతను మాత్రం మనసారా ప్రేమించేడు....అహోరాత్రాలూ ఆ ప్రణయదేవత ధ్యానముద్రలోనే జీవితమంతా గడిపేడు....చివరికి పాపం ఆమె సమాధిముందే-ఆమెకోసం తన ప్రాణాలు సైతం బలిచేశాడు.

కాని, మరి తనో?....అధికార గర్వంతో ఆమెని పరిణయమాడేడు....ఆ నాటినుంచే ఆమెని ప్రేమించడం మొదలుపెట్టేడు.... ఆమెచనిపోయిన తరువాత కూడా....ఆమెని విస్మరించలేక, ఆమె స్మరణలోనే తన జీవితం గడుపుతున్నాడు .... కాని, ఆ యువకునికి తనకీ మధ్య కొన్నియోజనాలు దూరం.

ప్రతిఫలరహితమైన ప్రేమ ఆ యువకుడిది....అందులో త్యాగంవుంది. ఆ త్యాగం చివరికి తనప్రాణాలు బలిపెట్టడానికి కూడా వెనుకాడకుండా చేసింది.

తన పాత్రలో తాను ఆ యువకునితో సరిపోల్చుకుంటే కొంతవరకూ పరాభవంపొందేడు అలంపనా.

అయినా ఆ యువకునిమీద అతనికి అణుమాత్రమైనా ఈర్ష్యాద్వేషాలు కలుగలేదు.... అందుకేనేమో?

నిండైన హృదయంతో అతని ఆత్మశాంతి కోసం అల్లానిధ్యానించాడు అతన్వాతఅలాఅలా.

అడుగులువేసుకుంటూ చీకటిని చీల్చుకుంటూ స్మశానంలోనించి తన మందిరం వైపు మందంగా నడక సాగించాడు అలంపనా! అయితే వాడి 'స్మృతిచిహ్నం'గా 'ఔలియా' తైలచిత్రాన్నిమాత్రం తనతో తీసుకుపోయాడు.

★